సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 30 । జూన్ । 2023

న్యూస్‌రీల్

'ఆసరా' సొమ్ము జమ

- స్పందించిన జిల్లా అధికారులు
- సెలవు రోజూ పనిచేసిన ఎస్‌బీఐ సిబ్బంది
- నేటి నుంచి రోజుకు 150 గ్రూపులకు జమ చేస్తామన్న బీఎం



వెలుగు ఏపీఎం తిలక్, సీసీల నుంచి గ్రూపుల వివరాలు, తీసుకుంటున్న బీఎం వీరభద్రరావు

సాక్షి ఎఫెక్ట్..

రావికమతం : కొత్తకోట స్టేట్ బ్యాంకు బక్రీద్ సెలవురోజూ పని చేసింది. వైఎస్‌ఆర్ ఆసరా సొమ్ము మూడు నెలలుగా బ్యాంకులోనే మూలుగుతోంది. డ్వాక్రా మహిళల ఖాతాలకు జమ చేయలేదు. దీనిపై గురువారం సాక్షిలో కథనం రావడంతో అటు బ్యాంకు జిల్లా అధికారులు, ఇటు వెలుగు జిల్లా అధికారులు స్పందించారు. మహిళల ఖాతాలకు సొమ్ము తక్షణం జమ కావాల్సిందేనని తగిన ఆదేశాలివ్వడంతో ఇటు వెలుగు ఏపీఎం తిలక్, సీసీలు , అటు బ్యాంకు అధికారులు ఆగమేఘాలు మీద స్పందించారు. వెలుగు వీవోఏలు డ్వాక్రా మహిళలతో సమావేశమై తీర్మాణాలు తీసుకున్నారు. తగిన వివరాలతో బ్యాంకు మేనేజర్ వీరభద్రరావుకు అందించగా గురువారం సెలవు రోజూ వారు పని చేసి 10కి పైగా డ్వాక్రా మహిళల ఖాతాలకు ఆసరా సొమ్ము జమ చేశారు. శుక్రవారం నుంచి రోజుకు 150 గ్రూపుల సభ్యులకు నగదు జమ చేస్తామని బీఎం తెలిపారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జగదీశ్వరరావు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రత్నప్రభ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. దీంతో డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

సరైన గణాంకాలతో సుస్థిర ప్రగతికి బాటలు



ప్రొఫెసర్ మహలనోబిస్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న జి.రామారావు, అధికారులు

తుమ్మపాల: గణాంకాలు మన నిత్యజీవితంలో భాగమని, మన దేశ భవిష్యత్ గమ్యానికి గణాంకాలే సూచికలని జిల్లా అర్థగణాంక శాఖ అధికారి జి.రామారావు అన్నారు. ప్రొఫెసర్ మహలనోబిస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గల అర్థగణాంక శాఖ కార్యాలయంలో గురువారం గణాంక దినోత్సవాన్ని నిర్వహించి మహలనోబిస్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి.రామారావు మాట్లాడుతూ దేశంలో సుస్థిర అభివృద్ధి సాధించాలని, జాతీయ సూచికలతో రాష్ట్ర సూచికలను అనుసంధానం చేయడమే ఈ గణాంక దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని అనానరు. ప్రతి వ్యవస్థ సరైన గణాంకాలను శాస్త్రీయతతో రూపొందించి రాష్ట్ర, దేశ భవిష్యత్‌కు నిర్దేశకులుగా ఉండాలని అనానరు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హుద్‌హుద్ నష్టం అవకతవకలపై 51బి విచారణ చేశాం

- రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ వెంకట్రావు వెల్లడి



చోడవరం : హుద్‌హుద్ తుఫాన్ సమయంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి జరిగిన నష్టంలో అవకతవకలపై 51బి విచారణ జరిపినట్టు రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ బి. వెంకట్రావు చెప్పారు. ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత మహాజనసభలో సభ్యుల తీర్మాణం మేరకు హుద్‌హుద్ తుఫాన్ నష్టంలో అవకతవకలు, మోలాసిస్ అమ్మకాల్లో వచ్చిన ఆరోపణలపై ప్రత్యేక కమిటీలో అంతర్గత విచారణ జరిపినట్టు కమిషనర్ చెప్పారు. హుద్‌హుద్ తుఫాన్ నష్టంపై ఇప్పటికే గతంలో మూడు దశల్లో విచారణ చేయడం, వచ్చిన నివేదికపై చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అయితే ఆ విచారణ కమిటీల్లో జేసీ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ సిఫారసు మేరకు మరోసారి 51బి శాఖాపరమైన విచారణ చేయడం జరిగిందని, నివేదిక ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకట్రావు చెప్పారు. సహకార రంగంలో నడుస్తున్న ఏకైక ఫ్యాక్టరీ అయిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి చేసేందుకు, రైతుల చెరకు బకాయిలు చెల్లించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్




కోటవురట్లలోని ముస్లిం కాలనీలో ప్రార్థనలు జరుపుతున్న దృశ్యం. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను జిల్లాలో గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. - కోటవురట్ల

తిరుగు రథయాత్ర వైభవం

అనకాపల్లి గూడ్స్‌రోడ్డులోగల స్వామివారి ఇంద్రద్యుమ్నహాలు నుంచి జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర దృశ్యమిది. ఇంద్రద్యుమ్న హాలు నుంచి జగన్నాథుని రథం గవరపాలెం పుట్టింటికి సాగింది. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ దంపతులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవాన్ని ప్రారంభించారు. ఎంపీ సత్యవతి విష్ణుమూర్తి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. - అనకాపల్లి టౌన్




7 స్కిల్ హబ్‌లు... 6 నైపుణ్యాలు



ప్రభుత్వం తీసుకొచ్చిన నైపుణ్య శిక్షణ కేంద్రాలు నిరుద్యోగులకు వరంలా మారాయి. 10, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఏ పట్టా ఉన్నా సరే నైపుణ్యాలు లేకపోతే ఏ రంగంలోనూ రాణించలేం. పోటీ ప్రపంచంలో రాణించాలన్నా, జీవనోపాధి పొందాలన్నా విద్యార్హతలతో పాటు ఆయా రంగాల్లో కనీస నైపుణ్యం అవసరం. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు, వృత్తి నిపుణులను తీర్చిదిద్ది పరిశ్రమలకు కావాల్సిన మానవ వనరులను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో నిరుద్యోగులు నైపుణ్య శిక్షణ పొంది ఇంటర్వ్యూలు ఎదుర్కొని వివిధ కంపెనీలలో ఉపాధి పొందుతున్నారు. ఇలా స్కిల్ హబ్‌లు యువత భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాయి.

- నిరుద్యోగుల ఉపాధికి భరోసా
- జిల్లాలో 180 మందికి ఉద్యోగాలు
- ఒక్కో విడతకు జిల్లాలో 250 మంది ఎంపిక
- ఇప్పటికి వరకు 12 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి
- జిల్లాలో నర్సీపట్నంలో 2 అనకాపల్లి, మాడుగుల, చోడవరం, పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో ఒక్కో స్కిల్ కేంద్రం



స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ అభ్యర్థులు (ఫైల్)

తుమ్మపాల : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ హబ్స్ ఏర్పాటయ్యాయి. గతేడాది అక్టోబర్ నుంచి జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏడు నియోజకవర్గాల్లో ఏడు స్కిల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనకాపల్లిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (రేబాక), నర్సీపట్నంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాకవరపాలెంలో న్యాక్ ట్రైనింగ్ సెంటర్, మాడుగులలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, చోడవరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యలమంచిలిలో ఎస్‌జీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఆయా నియోజకవర్గాల నిరుద్యోగులకు అందుబాటులో స్కిల్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నిరుద్యోగులు వారికి దగ్గరలో ఉన్న కేంద్రాలకు వెళ్లి వివిధ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ పొందుతున్నారు. స్కిల్ హబ్స్‌లో అభ్యర్థులు మూడు నెలల పాటు పలు కోర్సుల్లో శిక్షణ పొంది వివిధ పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు.

ఆరు రకాల నైపుణ్యాభివృద్ధి కోర్సులు

పదో తరగతి నుంచి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి నిరుద్యోగులుగా ఉన్న అభ్యర్థులకు వారి విద్యార్హతలను బట్టి వివిధ కోర్సుల్లో స్కిల్ హబ్స్‌లో నిష్ణాతులైన శిక్షకులు అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డోమస్టిక్ నాన్ వాయిస్, పేషంట్ రిలేషన్ అసోసియేట్, డొమస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అసోసియేట్, సూయింగ్ మిషన్ ఆపరేటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. ఈ కోర్సుల్లో మొదటి విడతలో శిక్షణ పొందిన 250 మందిలో ఇప్పటి వరకు 180 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొంది స్థిరపడ్డారు. మిగిలిన వారు ఇంటర్వ్యూలకు సిద్ధంగా ఉన్నారు. ప్రసుత్తం జిల్లాలో రెండవ విడతలో మరో 12 బ్యాచ్‌ల ద్వారా 360 మందికి శిక్షణ అందిస్తున్నారు. స్కిల్ హబ్‌లలో బ్యాచ్‌కు 30 మంది చొప్పున శిక్షణ నిస్తున్నారు.

ఇంటర్‌తోనే జాబ్ సాధించా..



నా పేరు కాకర హేమ, ఇంటర్‌మీడియట్ చేశాను. స్కిల్ హబ్ ద్వారా జూనియర్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ తీసుకున్నాను. శిక్షణ పూర్తవగానే 2050 హెల్త్‌కేర్ హైదరాబాద్‌లో జాబ్ వచ్చింది. నెలకు రూ.15000 జీతం వస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశంతోనే నైపుణ్యం పెంచుకుని ప్లేస్‌మెంట్ పొందాను. -కాకర హేమ

చక్కటి శిక్షణ



2020లో బీఎస్సీ కెమిస్ట్రీ డిగ్రీ పూర్తి చేశాను. అప్పటి నుంచి ఓ బీమా కంపెనీలో పనిచేస్తున్నాను. ఓ రోజు స్కిల్ డెవలప్‌మెంట్ లింక్ క్లిక్ చేశాను. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ వివరాలు తెలిసాయి. ఇందులో చేరాను. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు అవసరమైన శిక్షణ అందించారు. నెలకు రూ.19 వేల జీతంతో ఫెడ్ సర్వ్ కంపెనీలో ఉద్యోగం పొందాను. – లీల, బీఎస్సీ పట్టభద్రురాలు

180 మందికి ఉద్యోగాలు కల్పించాం



జిల్లాలో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి పొందేలా ప్రొత్సహించడానికి ప్రభుత్వం స్కిల్ హబ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మన జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్కిల్ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. శిక్షణ పొందిన వారిలో ఇప్పటి వరకు 180 మందికి ఉపాధి కల్పించాం. మరో 70 మంది ఇంటర్వ్యూలకు సిద్ధంగా ఉన్నారు. త్వరలో వారికి కూడా ఉద్యోగ అవకాశాలు పొందేలా ప్రోత్సహిస్తున్నాం. ఫెడ్ సర్వ్, పాత్ర, ర్యాండ్‌స్టాడ్, స్లైలెక్స్, హానర్, శ్రీరామ్, సీఈటీసీ, 2050 హెల్త్‌కేర్ వంటి కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. ఫలానా కంపెనీలోనే ఉద్యోగంలో చేరాలని ఎవరినీ బలవంతం చేయడం లేదు. కంపెనీల్లో హెచ్ ఆర్‌లతో మాట్లాడి ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తున్నాం. స్కిల్ హబ్‌లోనే వివిధ కంపెనీల ప్రతినిధుల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. ఈ అవవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. ఆయా కోర్సుల్లో అనుభవం కలిగిన వారితో అభ్యర్థులకు శిక్షణ ఇప్పిస్తున్నాం. -టి.చాముండేశ్వరరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

ప్రజల చెంతకే అధికారులు

- ఆర్‌డీవో జయరామ్



కాగిత సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులతోమాట్లాడుతున్న ఆర్‌డీవో జయరామ్

నక్కపల్లి : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని నర్సీపట్నం ఆర్‌డీవో జయరామ్ అన్నారు. గురువారం ఆయన మండలంలో కాగితలో సచివాలయాన్ని సందర్శించి జగనన్న సురక్ష సర్వేని పరిశీలించారు. గ్రామస్తులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు కావాల్సిన అవసరాలను సమస్యలను పదిరోజుల ముందుగానే ఇంటింటికి వెళ్లి తెలుసుకుని నిర్ణీత నమూనాలో వాటి గురించి అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా కుల ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, జనన, మరణ ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, మ్యూటేషన్లు వంటి పత్రాల కోసం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

ప్రజలు తమకు కావాల్సిన ధ్రువపత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ, సచివాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా అధికారులు, వలంటీర్లు ఇళ్లకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుని దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ దరఖాస్తులను ఆదేరోజు ఆన్‌లైన్ చేసి వారికి టోకెన్‌లు జారీ చేస్తారన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల సిబ్బంది పరిశీలించి నివేదిక తయారు చేస్తారన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి గ్రామాల వారీగా సచివాలయాల వద్ద జరిగే గ్రామసభల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు సబంధించి ధ్రువపత్రాలు జారీ చేస్తారన్నారు. ప్రజలకు పైసా ఖర్చులేకుండా వారికి కావాల్సిన ధ్రుపత్రాలు జారీ చేయడమనేది ఇప్పటివరకు ఎప్పుడూ జరగలేదన్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పులకించిన గరుడాద్రి

- భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు
- ఉపమాక వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం

నక్కపల్లి : తొలి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారు జామున మూడు గంటలకు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షనపల్లి కృష్ణమాచార్యులు, పి.వి.శేషాచార్యుల ఆధ్వర్యంలో గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవ మూర్తులు, గోదాదేవి సన్నిధిలో నిత్యార్చనలు అభిషేకాలు విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని, విష్వక్సేనుల వారిని నూతన వస్త్రాలు, సర్వాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తొలి ఏకాదశి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ ప్రధాన గోపురం, బేడామండపం, ఆస్థాన మండపాల చుట్టూ బారులు తీరి క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి మూలవిరాట్‌ను మెట్లమార్గంలో వెళ్లి దర్శించుకున్నారు.

పలువురు భక్తులు స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ వారు ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోలాట బృందాలు కోలాటం ప్రదర్శించారు. సాయంత్రం శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ, భజన కార్యక్రమాలు జరిగాయి. వేకువ జామున జరిగిన అభిషేకంలో ఏపీయుఎఫ్‌ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమతో 'గోవాడ'కు స్వయం సమృద్ధి

- సమీక్షలో రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ వెంకట్రావు



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ వెంకట్రావు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని స్వయం సమృద్ధితో నడిచేలా చేసేందుకు ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సహకార రంగంలో నడుస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ, ప్రస్తుత పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఉన్నతాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జిల్లా కలెక్టర్, ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జి రవి సుభాష్ పట్టాన్ శెట్టి, రాష్ట్ర కేన్ కమిషనర్ వి. వెంకట్రావు, ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ సన్యాసినాయుడు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఫ్యాక్టరీ కేన్ క్యారీయర్, బాయిలర్ యూనిట్, కో జనరేషన్ ప్లాంట్‌లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర సహకార రంగంలో నడుస్తున్న ఏకైక ఫ్యాక్టరీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అన్నారు. ఈ ఫ్యాక్టరీని ఆధునికీకరించడం ద్వారా పరిశ్రమను కాపాడడంతోపాటు చెరకు రైతులకు, కార్మికులకు మేలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉప ఉత్పత్తుల యూనిట్ అదనంగా ఏర్పాటు చేస్తేనే ఫ్యాక్టరీకి మనుగడ ఉంటుందని భావిస్తున్నామని, ఇదే విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దేశంలో ఇథనాల్‌కు చాలా డిమాండ్ ఉందని, 1300 కోట్ల లీటర్ల ఇథనాల్ అవసరం కాగా ఇంకా 700 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి అవసరం ఉందని చెప్పారు. అందుకు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో దేశంలో ఇథనాల్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుకూలంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని గోవాడ ఫ్యాక్టరీలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే 60 కోట్ల లీటర్ల కెపాసిటీ కలిగిన ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ఇప్పటికే పర్యావరణ అనుమతులు కూడా ఇవ్వడంతో ఈ పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కెపాసిటీని దశలవారీగా విస్తరించే విధంగా ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు రూ.95 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దీనికి బ్యాంక్ గ్యారెంటీతో పాటు 10శాతం ఫ్యాక్టరీ వాటా ధనాన్ని కూడా ప్రభుత్వమే సమకూర్చే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆమోదం తెలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రభుత్వ గ్యారెంటీతో రూ.67 కోట్లు, గ్రాంట్‌గా మరో రూ.16 కోట్లు ఇప్పటి వరకూ ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం భరించి, ప్రభుత్వ షేర్ ధనంగా ఫ్యాక్టరీకి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇదిలావుండగా కొత్తగా రైతుల చెరకు బకాయిలు, ఈ సీజన్ క్రషింగ్ ఓవర్‌హాలింగ్ పనులు, ఇతర అవసరాల నిమిత్తం మరో రూ. 23 కోట్లు అవసరమని యాజమాన్యం కోరడంతో ఈ నిధులు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి చెప్పారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ సహకార సుగర్ ఫ్యాక్టరీలను పూర్తిగా నిర్వీర్యం చేసింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. మహానేత రాజశేఖరరెడ్డి హయాంలో ఫ్యాక్టరీని ఆదుకుంటే, మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా అడుగులు వేశారన్నారు. గోవాడ ఫ్యాక్టరీని రూ.170 కోట్ల అప్పుల ఊబిలోంచి రక్షించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 80 కోట్లు వరకూ సాయం అందించారన్నారు. జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి మాట్లాడుతూ ఫ్యాక్టరీ, రైతుల సంక్షేమంపై మంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్షలో చర్చించడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఫ్యాక్టరీ ఓవర్‌హాలింగ్ పనులపై ఎంత ఖర్చు పెట్టాలనే అంశంపై ముందస్తు ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రైతుల బకాయిలు త్వరలోనే చెల్లించేందుకు చర్యలు చేట్టామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు, ఫీల్డు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయితో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం : గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ రామారావు తెలిపారు. గబ్బాడ వంతెన వద్ద గురువారం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చింతపల్లి వైపు నుంచి నర్సీపట్నం వస్తున్న టాటా సుమో వాహనాన్ని తనిఖీ చేయడంతో గంజాయి బయటపడింది. గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన గాసిరం ఖార(25), రాజేంద్రసింగ్(30), చంద్ర బడనాయక్(23)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కారులోని 96 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బయ్యవరం రైల్వేస్టేషన్ సమీపంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కశింకోట : మండలంలోని బయ్యవరం-నరసింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి గురువారం అక్కడికక్కడే మృతి చెందినట్టు తుని రైల్వే ఇన్‌ఛార్జి ఎస్ఐ లోవరాజు తెలిపారు. మృతుని పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు. గత మూడేళ్లగా రైలు పట్టాలపై వాటర్ ఖాళీ బాటిళ్లు ఏరుకొని అమ్ముకొని జీవనం సాగిస్తూ ఇక్కడి రైలు వంతెన కింద నివాసం ఉండేవాడని స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు, కుటుంబ సభ్యులు, బంధువులు తుని రైల్వే పోలీసుస్టేషన్‌లో తమను సంప్రదించాలని కోరారు.

ఎన్ఆర్ఈజీఎస్ మస్తర్లలో బినామీ బాగోతం

- ఎర్రవరం పెద్దకొండ కండిత కందకాల్లో పని చేయని 17 మందికి మస్తర్లు
- గుర్తించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్
- ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసిన ఎంపీడీవో



కూలీల మస్తర్లు తనిఖీ చేసిన అసిస్టెంట్ ఇంజనీర్. చిత్రంలో ఉపాధి హామీ కూలీలు

అచ్యుతాపురం (అనకాపల్లి): కూలీలకు అండగా అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొందరు సిబ్బంది స్వార్థంతో పక్కదోవ పట్టిస్తున్నారు. పనికి తగ్గ వేతనాన్ని అందజేసి కూలీలకు సౌకర్యాలు కల్పించాల్సిన గ్రామస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ల వైనం అక్కడక్కడ బయటపడుతోంది. అచ్యుతాపురం మండలంలోని ఎర్రవరం సచివాలయం పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్ బినామీ మస్తర్లు వేసిన భాగోతం వెలుగులోకి రావడంతో ఎంపీడీవో విజయలక్ష్మి షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ దర్యాప్తు..

అచ్యుతాపురం మండలంలోని ఎర్రవరం పరిధిలోని పెద్దకొండ కండిత కందకాల తవ్వకాలు జరుపుతున్నారు. ఈ నెల 19 నుంచి 25 వరకూ జరిగిన పనులకు సంబంధించి కూలీల మస్తర్లపై తనిఖీ చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి సచివాలయ ఉద్యోగిని ఆదేశించారు. వాస్తవానికి ప్రతి బుధవారం నిర్వహించే సమీక్షా సమావేశంలో ఎర్రవరం ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌కు సంబంధించిన పనితీరుపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ నెల 24న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ అఫ్రిన్ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. సదరు పనులకు 82 మంది హాజరవుతున్నట్లు చూపించగా, అసిస్టెంట్ ఇంజినీర్ కూలీలను లెక్కపెట్టారు. క్షేత్ర స్థాయిలో 65 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించి వారి పేర్లను నివేదించారు. కూలీల రోజు వారి సరాసరి వేతనం రూ. 272గా మార్కింగ్ ఇచ్చినట్లు గుర్తించారు. 17 మంది పనులు చేయకుండానే బినామీ మస్తర్లు వేశారని ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎంపీడీవోకు నివేదిక ఇవ్వడంతో ఎంపీడీవో సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని ఎంపీడీవో ఆదేశించారు.

గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన మహానేత వైఎస్సార్



క్రిష్ణంపాలెం గిరిగ్రామంలో మహానేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం శంకరం పంచాయతీ గిరి గ్రామం క్రిష్ణంపాలెంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మాట్లాడారు ఆరోగ్యశ్రీ పథకం పెట్టి లక్షల మంది ప్రాణాలు కాపాడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి నిరుపేదలను ఆదుకున్న మహానుభావుడు వైఎస్సార్ అన్నారు. ప్రతి గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యం తీసుకురావడానికి నిరంతరం తపించిన వ్యక్తి గొప్పనేత అని గుర్తు చేశారు. ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయ సాధనకు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యం తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ సాలం రమేష్, జి.ఈశ్వరరావు, కేజేపురం సర్పంచ్ జామి రమణబాబు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో ఏపీఐఐసీ, ఏడీబీ అధికారుల పర్యటన

- ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములపై ఆరా



కారిడార్ భూములు, వాటి రికార్డులు పరిశీలిస్తున్న ఏపీఐఐసీ, ఏడీబీ అధికారులు

నక్కపల్లి : మండలంలో తీరప్రాంత గ్రామాల్లో గురువారం ఏపీఐఐసీ, ఏడీబీ (ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు) అధికారులు పర్యటించారు. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో నక్కపల్లిని క్లస్టర్ చేర్చారు. ఈ క్లస్టర్‌లో పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా సుమారు 5 వేల ఎకరాల భూములు సేకరించిన విషయం తెలిసిందే. 2010 అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ ప్రక్రియ జరిగింది.

తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం భూసేకరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం చెల్లించి కొంతమేర భూసేకరణ పూర్తి చేశారు. అయితే రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించలేదు. 2019లో అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిరాయితీ రైతులకు డీఫారం రైతులకు ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో చెల్లించింది. ఏపీఐఐసీ నోటిఫికేషన్‌లో ఉన్న భూములన్నింటినీ స్వాధీనం చేసుకోవడంతో పాటు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టి సారించింది. స్టార్టప్ ఏరియా కింద 1100 ఎకరాలు కూడా సిద్ధం చేసింది. రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ తదితర సదుపాయాల కోసం రూ.380 కోట్లు కూడా కేటాయించింది. ఇక్కడ కంపెనీలు ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. దీంతో గురువారం ఏపీఐఐసీ అధికారులు ఏడీబీ అధికారులు ఏపీఐఐసీ పరిధిలో ఉన్న గ్రామాల్లో పర్యటించారు. చందనాడ, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట తదితర గ్రామాల్లో ఎంత భూసేకరణ జరిగింది. నష్టపరిహారం చెల్లింపుల్లో ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా. స్టార్టప్ ఏరియా ఎంత సిద్ధం చేశారనే దానిపై ఆర్‌డీవో జయరాం, తహసీల్దార్ అంబేద్కర్, ఏపీఐఐసీ ఎస్‌డీసీల నుంచి వివరాలు సేకరించారు.

కొంతమంది రైతులు కలసి డీఫారం, ప్రభుత్వ భూములకు సంబంధించిన కొంతమందికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని, అలాగే గత ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్యాకేజీ కూడా పెండింగ్‌లో ఉందని అధికారులకు తెలిపారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ పరిహారం చెల్లింపులు దాదాపు పూర్తయ్యాయని ఎక్కడైనా మిగిలిపోతే విచారణ జరిపి చెల్లిస్తామన్నారు.

మా పాపకు ప్రాణం పోసిన దేవుడు జగనన్న

- భావోద్వేగానికి లోనైన గిరిజన కుటుంబం



రాజగోపాలపురంలో ఎమ్మెల్యేకు సీఎం జగన్ సాయాన్ని వివరిస్తున్న నిఖిత కుటుంబ సభ్యులు

కోటవురట్ల: 'మా పాపకు జగనన్న ప్రాణం పోశారు.. వైద్యం కోసం అడగ్గానే దేవుడిలా అభయం ఇచ్చారు.. జగనన్న మా బిడ్డను హత్తుకుని నేనున్నానంటూ ఇచ్చిన భరోసాను మా జీవితంలో ఎన్నడూ మరిచిపోలేం..మా బిడ్డకు దేవుడిచ్చిన మేనమామ జగనన్న' అంటూ ఓ గిరిజన కుటుంబం ఉద్వేగానికి లోనయింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో ఓ ఇంటికి వెళ్లగానే పాప నిఖిత తల్లిదండ్రులు భావోద్వేగానికి గురై తమ సంతోషాన్ని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అంతులేని అభిమానాన్ని వ్యక్తపరిచారు. రాజగోపాలపురానికి చెందిన బొండపల్లి చంటి, వేణమ్మల కుమార్తె బొండపల్లి శ్రీ వెంకట దుర్గా నిఖిత అనే బాలిక లివర్ సంబంధ వ్యాధితో బాధపడుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నంలో జరిగిన బహిరంగ సభకు రాగా తమ కుమార్తెను ఆదుకోవాలని నిఖిత తల్లిదండ్రులు వేడుకున్నారు. స్పందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే అధికారులకు ఆదేశాలిచ్చారు. రూ.10 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేశారు. తక్షణ సాయంగా రూ.లక్ష నగదును కలెక్టర్ రవి పట్టాన్ శెట్టికి అందజేయగా మిగిలిన నగదు చికిత్సకు అందించనున్నారు. ఈ నేపథ్యంలో చికిత్స కోసం హైదరాబాద్‌లోని జీవన్‌ధార ఆస్పత్రిలో రిజిస్ట్రేషన్ చేయించినట్టు తల్లిదండ్రులు తెలిపారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం దాత లభించిన వెంటనే చికిత్స అందించనున్నట్టు తెలిపారు. దాత కోసం చూస్తున్నామని, సీఎం జగన్ చేసిన సహాయాన్ని ఎన్నటికీ మరిచిపోమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లిస్తాం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ఏడీబీ బృందం ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

తుమ్మపాల: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన వారికి రూ.106 కోట్ల మేర నష్టపరిహారం త్వరలో చెల్లించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ప్రతినిధులు కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించిన మంత్రి అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు నియోజకవర్గాలను, పారిశ్రామిక పార్కును కలుపుతూ ఉన్న ఈ రోడ్డు ద్వారా వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణ పనులు పూర్తయినట్లు తెలిపారు. ఈ రోడ్డుకు ఇరువైపులా భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించే విషయమై ప్రభుత్వం స్పష్టతతో ఉందన్నారు. నష్టపరిహారం నాలుగు విడతల్లో చెల్లించనున్నామన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో కొంత మేర నష్టపరిహారం చెల్లించేందుకు, మరి కొంత రోడ్డు నిర్మాణానికి వినియోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారుల, ఏడీబీ బృందం ప్రతినిదులు పాల్గొన్నారు.

ఇంటర్ తప్పడంతో పరార్

- ముగ్గురు విద్యార్థులు సేఫ్
- హైదరాబాద్ నుంచి విశాఖ తీసుకొచ్చిన పోలీసులు



మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): ముగ్గురు విద్యార్థులు ఇంటి నుంచి పరారైన సంఘటనలో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మూడు బృందాలతో దర్యాప్తు చేపట్టగా వారు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులను అక్కడి నుంచి సురక్షితంగా తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. గాజువాకకు చెందిన పిల్లల దిలీప్ (16), జి.ఉమేష్ పవన్(16), ఉపాడ బాబి (16) పాత గాజువాక ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరు కొన్ని సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యారు. తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో ఇంటి నుంచి పరారయ్యారు. ఈ నెల 25న కాలేజీకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి కె.కోటపాడులో ఉన్న దిలీప్ ఇంటికి వెళ్లారు. తరువాత అక్కడి నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చి తిరువనంతపురం రైలు ఎక్కారు. తమ పిల్లలు ఇంటికి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వారు సికింద్రాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. అక్కడి జీఆర్‌పీ పోలీసుల సాయంతో విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గాజువాక పోలీసులు సికింద్రాబాద్‌కు వెళ్లి విద్యార్థులను తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

మూడేళ్లలో నలుగురికే గన్ లైసెన్సులు

గన్ లైసెన్సుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నారన్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ తెల్చి చెప్పారు. 2020 నుంచి ఇప్పటి వరకు కేవలం 15 మంది మాత్రమే లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో కేవలం నలుగురికి మాత్రమే గతంలోనే లైసెన్సులు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కూడా 2020లోనే లైసెన్సు కోసం దరఖాస్తు చేశారని, అయితే ఇప్పటి వరకు మంజూరు చేయలేదన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యం

- ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందరిని కలుపుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. అనకాపల్లి జిల్లాలోని అన్ని శాసన సభ స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకునేలా కృషి చేయాలన్నారు. సర్పంచ్ దిమ్మల

అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశిబాబు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, సూరిశెట్టి కన్నారావు, వేగి కృష్ణ, బొడ్డేడ మహేష్, పెంటకోట ఆదినారాయణ, మునగపాక ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

2న భారీ బైక్ ర్యాలీ..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా బొడ్డేడ ప్రసాద్ నియమితులైన సందర్భంగా వచ్చే నెల 2న భారీ బైక్ ర్యాలీ జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు తెలిపారు. ఈ ర్యాలీ అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నుంచి రింగ్‌రోడ్డు, అనకాపల్లి నెహ్రూచౌక్ మీదుగా అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా మునగపాకకు చేరుకుంటుందన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

- ముషిడిపల్లి యువకుడి మృతి
- వేపాడ మండలం సంజీవ మెట్ట వద్ద ప్రమాదం





ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు, ధ్వంసమైన ద్విచక్ర వాహనం



క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలిస్తున్న స్థానికులు (ఇన్‌సెట్) మృతుడు లక్ష్మణరావు(ఫైల్)

దేవరాపల్లి : దేవరాపల్లి-వావిలపాడు రోడ్డులో సంజీవమెట్ట వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గ్రామ శివారు రావాడపాలేనికి చెందిన రావాడ లక్ష్మణరావు(22) మృతి చెందాడు. వేపాడ మండలం సంజీవమెట్టలోని తన బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై రోడ్డు మలుపు తిరుగుతున్న లక్ష్మణరావును వావిలపాడు జంక్షన్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మణరావును 108 వాహనంలో దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు. ఘటనలో కారు నుజ్జు కాగా ద్విచక్ర వాహనం సైతం ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన ప్రాంతం విజయనగరం జిల్లా వేపాడ మండలం పోలీస్‌స్టేషన్ పరిధి కావడంతో అక్కడి పోలీసులకు బంధువులు సమాచారం అందించారు. కాగా కవలల్లో ఒక్కరైన లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామం ముషిడిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మేనత్త ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన తన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తల్లిదండ్రులు భోరున విలపించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



మృతుడు వీరసుబ్రహ్మణ్యం

కశింకోట: మండలంలోని ఏఎస్ పేటలో ఉన్న రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు అందించిన వివరాల ప్రకారం.. రాజమండ్రి జిల్లా తుమ్మలోవ గ్రామానికి చెందిన ఉట్లకుమార్ వీరసుబ్రహ్మణ్యం (24) ఏఎస్ పేటలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. దీంతో పరిశ్రమ అంబులెన్స్‌లో అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహాపై ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి రాత్రి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు ప్రకటించారు. ఈ మేరకు మృతునితో పాటు పని చేస్తున్న బావ గజ్జెల్ల గోవింద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం జరిపించి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

నర్సీపట్నం : విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టౌన్ సీఐ ఎన్.గణేష్ తెలిపారు. ఈ నెల 28న స్కూల్‌కు వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక బంధువులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. 24 గంటలల్లో సీసీ పుటేజీల ఆధారంగా మున్సిపాలిటీ పాతబస్టాండ్‌లో ఉంటున్న కణితి కనకారావు (31)ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టాప్ ర్యాంక్ లక్ష్యం

- అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య కార్మికుల నియామకం
- గిరి ప్రదక్షిణలో సింగిల్ ప్లాస్టిక్ వినియోగం నిషిద్ధం
- 'ఎకో వైజాగ్' అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



అల్లిపురం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులను నియమిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తెలిపారు. పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన వారిపై, 60 ఏళ్లు పైబడిన కారణంగా విధుల నుంచి తొలగించబడిన కార్మికులపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రాధాన్యం కల్పిస్తూ 482 ఖాళీల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. మొదటి విడతలో 119 మంది అభ్యర్థులను ఎంపిక చేసి.. ఆప్కోస్‌లో వివరాలు నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కండి

జూలై 1 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్-2023కు సంబంధించి సిటిజన్ ఫీడ్ బ్యాక్ ప్రారంభమవుతుందని కమిషనర్ తెలిపారు. నగర ప్రజలు ఇందులో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు జూలై 7న 'ఎకో వైజాగ్' కాన్సెప్ట్‌పై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

క్లుప్తంగా

గోపాలపురంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని గోపాలపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాల్సిందిగా కోరారు.

గ్రావెల్ రోడ్డు, మదుం పనులు ప్రారంభం

కశింకోట : స్థానిక కస్పావీధిలోని మరిడిమాంబ ఆలయ ప్రాంతంలో గ్రావెల్ రోడ్డు, మదుం నిర్మాణ పనుల్ని గురువారం చేపట్టారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇందుకు రూ.8 లక్షలు సమకూర్చారు. ఈ నిధులతో చేపట్టిన పనులను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పరిశీలించారు.

రేపు విద్యుత్ నిలుపుదల

అనకాపల్లిటౌన్ : మండలంలోని మామిడిపాలెం పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మత్తుల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ విద్యుత్‌ను నిలుపుదల చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో గృహయజమానులు, పరిశ్రమలు, విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

లలితా సహస్రనామ పారాయణ దీక్ష


లలితా సహస్రనామ పారాయణలో మహిళలు

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన శారదా గణపతి రామాలయంలో గురువారం రాత్రి లలితా సహస్ర నామ పారాయణ మండల దీక్షను ప్రారంభించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని చేపట్టిన దీక్ష 41 రోజులపాటు నిత్యం సాగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో కలశాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. లలితా సహస్ర నామ పారాయణ అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 51 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,930	4,000
మూడోరకం	3,850	3,880

అనకాపల్లి సినిమాలు

మనుచరిత్ర	రాజా
టక్కర్	సత్యనారాయణ స్క్రీన్-1
ఇండియానా జోన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది?	షిర్డిసాయి
అశ్విన్స్	పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచి (3 ఆటలు)	
ది ఫ్లాష్ (మ్యాట్నీ)	వెంకటేశ్వర
స్పై	శ్రీసత్య
సామజవరగమన	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధికి మెచ్చుతునక గోపాలపురం

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పల్లె ముంగిటకు తీసుకొచ్చారు. గ్రామాలు అభివృద్ధి చెందినపుడే వలసల్ని అరికట్టవచ్చన్న సీఎం జగన్ ఆశయాలు కార్యరూపం దాల్చుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధిబాట పడుతున్నాయి.

- అందుబాటులో రోడ్లు, వైద్యం, సామాజిక భవనం తదితర వసతులు
- రూ.1.92 కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభం నేడు


ప్రారంభానికి సిద్ధంగా విలేజ్ హెల్త్ క్లినిక్


ప్రారంభానికి సిద్ధం చేసిన రైతు భరోసా కేంద్రం


గోపాలపురం నుంచి చినముషిడివాడకు వేసిన తారురోడ్డు

అనకాపల్లిటౌన్: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలన్న గాంధీ మహాత్ముడి బాటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోంది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామం ప్రాతిపదికనే జరుగుతున్నాయి. సచివాలయాల కేంద్రంగా గ్రామస్తులకు అవసరమైన ప్రతి కార్యక్రమం వారింటి ముంగిటకే చేరుతోంది. అందుకు మండలంలోని గోపాలపురం పంచాయతీ ఓ నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు నోచుకున్న గ్రామంలో రూ.కోటీ 92 లక్షలతో చేపట్టిన నిర్మాణాలను మంత్రి అమర్‌నాథ్ శుక్రవారం ప్రారంభించనున్నారు.

చేరువైన అభివృద్ధి

గోపాలపురం పంచాయతీ పరిధిలో 2,185 మంది జనాభా నివసిస్తున్నారు. అనకాపల్లి పట్టణానికి గోపాలపురం సుమారుగా 10 కిలోమీటర్ల దూరం. ఈ గ్రామంలో ఎక్కువగా రైతు కుటుంబాలే జీవిస్తున్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి తమదని గత ప్రభుత్వాల హయాం నుంచి కనిపించిన ప్రతి నాయకుడినీ, ప్రభుత్వ ప్రతినిధినీ వేడుకునేవారు. గత పాలకులు వీరిని ఓటర్లుగానే గుర్తించారు తప్ప, వీరి సమస్యల్ని పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో గ్రామం రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. దశలవారీగా గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడంలో ఈ గ్రామ ప్రతినిధులు ముందంజలో ఉన్నారు.

నేడు ప్రారంభంకానున్న అభివృద్ధి పనులు

- రైతులకు పూర్తి స్థాయి వసతులతో రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే ఏర్పాటు
- గ్రామంలోనే వైద్యం అందించేందుకు వీలుగా రూ.17.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్
- గోపాలపురం నుంచి పరవాడ మండలం చినముషిడివాడ వరకూ రూ.కోటితో 1.5 కిలో మీటర్ల తారు రోడ్డు నిర్మాణం
- రూ.15 లక్షలతో నూతన అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు
- గ్రామంలో ప్రజ కార్యక్రమాల నిర్వహణకు రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాలు
- రూ.15 లక్షలతో మంచినీటి ట్యాంక్
- రూ.12 లక్షలతో గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ తదితర అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి అమర్‌నాథ్ శుక్రవారం ప్రారంభించనున్నారు. దీంతో గ్రామస్తులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలకు దాదాపు పరిష్కారం లభించినట్టయింది.

పట్టణానికి వెళ్లే అగత్యం లేదు



జగనన్న ప్రభుత్వంలో మా గ్రామానికి అన్ని రకాల సదుపాయాలు సమకూరాయి. గతంలో ఏ సమస్య వచ్చినా 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనకాపల్లి పట్టణానికి వెళ్లాల్సి వచ్చేది. రాకపోకలకే చాలా సమయం వృధా అయ్యేది. ప్రస్తుతం అన్ని పనులు ఊర్లోనే పూర్తవుతున్నాయి. దీంతో పట్టణానికెళ్లే అగత్యం తప్పింది.

– సేనాపతి ధనలక్ష్మి, స్థానికురాలు

గ్రామాభివృద్ధికి రూ.కోట్లు



గ్రామంలో రైతు కుటుంబాలు ఎక్కువగా జీవిస్తున్నాయి. ఉదయాన్నే పనిలోకి వెళ్తేగాని వీరి జీవనం సాగే పరిస్థితి లేదు. దశలవారీగా ప్రభుత్వం సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం, రహదారులలను అభివృద్ధి చేసింది. దీంతో చాలా సమస్యలకు గ్రామ స్థాయిలోనే పరిష్కారం దొరుకుతోంది. గ్రామస్తులు ఆనందంగా ఉన్నారు.

– ఎం.గుణలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

దశలవారీగా అభివృద్ధి



ప్రభుత్వ ఆదేశాల మేరకు 32 గ్రామ పంచాయతీలను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే కార్యాచరణ మొదలయింది. గ్రామాలను అభివృద్ధి చేసినప్పుడే పట్టణాలకు వలసలు తగ్గుతాయి. గ్రామాల్లో పుట్టిన వారు, ఇక్కడే ప్రశాంతంగా జీవించేందుకు వీలయ్యేలా అభివృద్ధి జరగనుంది.

– కె.వి.నరసింహారావు, ఎంపీడీవో

ప్రధాని మోదీ పాలనపై ప్రచారం


కేంద్ర ప్రభుత్వ పథకాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాలకొండయ్య, అప్పారావు

కశింకోట : కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 95 శాతం నిధులను కేటాయించి గ్రామాల అభివృద్ధికి దోహదపడుతోందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి వై.మాలకొండయ్య అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో ప్రధానిగా మోదీ 9 ఏళ్ల సుపరిపాలనపై పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గరీబ్ కల్యాణ్ అన్న యోజన, జల్ జీవన్ మిషన్ తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి అప్పికొండ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గారావు కుటుంబాన్ని ఆదుకోవాలి

కశింకోట: అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు పాలమరశెట్టి జగ్గారావు కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కె.లోకనాథం, సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు, జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక గవరపేటలోని జగ్గారావు కుటుంబ సభ్యులను గురువారం కలిసి ఓదార్చారు. ఐద్వా నాయకురాలు డీడీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన బొడ్డేడ



మునగపాక : ఉప ముఖ్యమంత్రి,పంచాయతీ రాజ్ శాఖామంత్రి బూడి ముత్యాలనాయుడును నూతనంగా నియమితులైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముత్యాలనాయుడుకు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

పారిశ్రామికంగా అనకాపల్లి అభివృద్ధి

- త్వరలోనే అందుబాటులోకి రానున్న ఆటోనగర్
- 'గడప గడపకు మన ప్రభుత్వం' లో మంత్రి అమర్‌నాథ్


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామని, మండలంలో కోడూరు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న ఆటోనగర్ త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మండలంలోని కొత్త, పాత కోడూరు, మర్రిపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన ప్రయోజనాన్ని గణాంకాలతో సహా వివరించారు. నాడు–నేడు పనుల్లో భాగంగా రూ.40 లక్షలతో ఎంపీపీ స్కూల్, రూ.12 లక్షలతో అభివృద్ధి చేసిన అంగన్‌వాడీ భవనాన్ని, అనకాపల్లి, కోడూరు, కశింకోట, మునగపాకలోని వివిధ ప్రాంతాలకు రక్షిత మంచి నీటిని అందించే వాటర్‌హెడ్ ట్యాంక్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే విద్యా, వైద్య రంగాలతో పాటు ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ ఇప్పటికే నెరవేర్చారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తూ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే ఇలాంటి సీఎంను మళ్లీ మళ్లీ గెలిపించుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉద్యోగులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పూడిమడకలో ఘనంగా తిరుగు రథయాత్ర


తిరుగు రథయాత్రలో భక్తుల కోలాహలం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర గురువారం ఘనంగా జరిగింది. స్వామివారిని రథంపై ఊరేగించారు. నవ రాత్రులు స్వామివారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో ఊరేగిన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

వరి విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని సబ్బవరం రైతు భరోసా కేంద్రం వద్ద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీ వరి విత్తనాలను గురువారం ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారానే సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలో అన్ని రకాల విత్తనాలు రైతులకు రాయితీపై అందించేందుకు 100 టన్నుల సిద్ధంగా ఉన్నాయన్నారు. వరి విత్తనాలపై కిలోకు రూ.10 చొప్పున రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. బీపీటీ 3291(సోనామసూరి), బీపీటీ 5204 (సాంబా మసూరి), ఆర్‌జేఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు), ఎంటీయూ 1064, ఎంటీయూ 1021 మొదలైన రకాలు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి అప్పలనాయుడు, సబ్బవరపు బుజ్జి, మామిడి కొండాజీ, బోను గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం


జూనియర్ కళాశాలలో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న మోహన్‌రావు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శ్రీ భార్గవి అమోనియా అండ్ కెమికల్స్ సంస్థ సమకూర్చిన ఆర్వో ప్లాంట్‌ను పరవాడ ఇండస్ట్రీస్ సర్వీస్ సొసైటీ అసోసియేషన్ చైర్మన్ గుత్తికొండ మోహన్‌రావు గురువారం ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జి.వి. నారాయణరావు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో లాలం కోడూరు ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ నాయుడు, విశ్రాంత ఫిజిక్స్ అధ్యాపకుడు శ్రీరంగనాయకులు, పరవాడ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందఅప్పారావు, ప్రతినిధులు కిశోర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ముత్యాలరావుకు ఎమ్మెల్యే పరామర్శ


బొట్ట ముత్యాలరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: కుమార్తెను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న వైఎస్సార్‌సీపీ 88వ వార్డు యూత్ అధ్యక్షుడు బొట్ట ముత్యాలరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం పరామర్శించారు. వెదుళ్లనరవలోని బొట్ట ముత్యాలరావును స్వగృహం వద్ద ఆయన్ను ఎమ్మెల్యే ఓదార్చి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గర్రెడ్డి మహాలక్ష్మినాయుడుతో కలిసి ఎమ్మెల్యే పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. మంజులశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ స్థానిక నాయకులు ఉన్నారు.

కల్కి అవతారంలో జగన్నాథుడు


కల్కి రూపంలో జగన్నాథస్వామి అలంకరణ


స్వామివారికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న ఎంపీ సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్

- ఘనంగా తిరుగు రథోత్సవం

అనకాపల్లిటౌన్ : స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు కల్కిఅవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.ఆదినారాయణ, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా తిరుగు రథయాత్ర

జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర గూడ్స్ రోడ్డులోని ఇంద్రద్యుమ్నహాల్ నుంచి గవరపాలెం పుట్టింటి వరకు సాగింది. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మీ రమేష్ దంపతులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవాన్ని ప్రారంభించారు.

తొలుత ఎంపీ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గూడ్స్‌రోడ్డు నుంచి ప్రారంభమైన రథయాత్ర మళ్లవీధి, గాంధీబొమ్మజంక్షన్, పెరుగుబజార్ జంక్షన్, మెయిన్‌రోడ్డు మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయ రహదారి, వేల్పులవీధి జంక్షన్, నెహ్రూచౌక్, శారదానది బ్రిడ్జి వరకు వెళ్లి, తిరిగి పెరుగుబజార్ జంక్షన్‌కు అక్కడి నుంచి రింగ్ రోడ్డు, గవరపాలెంలోని పలు ప్రాంతాల్లో ఊరేగి, అగ్గి మర్రిచెట్టు వద్ద జగన్నాథస్వామి ఆలయానికి చేరుకుంది. రథోత్సవంలో భాగంగా గూడ్స్‌రోడ్డు స్వామివారి ఆలయం వద్ద ఆలయ ఈవో ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ దాడి మోహన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 81వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, ఆలయ మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రేబాక మధు, ఉగ్గిన అప్పారావు, నాయుడు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల ముగింపులో భాగంగా గురువారం సాయంత్రం తిరుగు రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయం నుంచి జగన్నాథస్వామి, బలభద్ర, సుభద్రల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన రథంపై నిలిపి ఊరేగించారు. భక్తులు రథాన్ని ఆద్యంతం ఉత్సాహంగా లాగి ఊరేగించారు. ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామిని కల్కి అవతారంలో అలంకరించి విష్ణు సహస్ర నామాలతో అర్చన చేశారు.

ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, రేజేటి రామచరణాచార్యులు, రేజేటి కన్నబాబు తదితరులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


కశింకోటలోని నూరి మసీదులో బక్రీద్ ప్రార్థనల్లో ముస్లింలు


జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కశింకోట : మండలంలో బక్రీద్ పండగను ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా కశింకోటలోని పురాతన జామియా మసీదుతోపాటు నూరి మసీదు, నరసింగబిల్లిలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నూరి మసీద్‌లో జరిగిన ప్రార్థనల్లో కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రహ్మతుల్లా, కార్యదర్శి ఎస్ఎంఎం ఆలీ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక ప్రార్థనలకు మండలంతోపాటు అనకాపల్లి మండలం సంపతిపురం, అచ్యుతాపురం మండలం కొండకర్ల ప్రాంతాల నుంచి ముస్లింలు ఉత్సాహంగా హాజరయ్యారు. మండలంలోని చింతలపాలెం మసీదులో కూడా ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు.

అనకాపల్లిటౌన్ : పట్టణంలో బక్రీద్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులు స్థానిక చిన నాలుగు రోడ్ల కూడలిలో జామియా మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుని, శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

జేసీఎస్ ఇన్‌చార్జిల నియామకం


గొర్లి సూరిబాబు


జానకీరామరాజు


కొణతాల మురళీకృష్ణ


గున్నయ్యనాయుడు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి నియోజకవర్గ పరిధిలో జేసీఎస్ ఇన్‌చార్జిలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. అనకాపల్లి మండల ఇన్‌చార్జిగా గొర్లి సూరిబాబు, జీవీఎంసీ పరిధిలోని అనకాపల్లి క్లస్టర్1(81, 82, 83, 84 వార్డుల)కు మందపాటి జానకీరామరాజు, క్లస్టర్-2(80, 81, 84 వార్డుల)కు కొణతాల మురళీకృష్ణ, కశింకోట మండలం ఇన్‌చార్జిగా కలగా గున్నయ్యనాయుడుని నియమిస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి కూలీల ధర్నా


వాడచీపురుపల్లి చెరువు వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వాడచీపురుపల్లి చెరువు వద్ద కూలీలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఆరు వారాల నుంచి వేతనాలు చెల్లించక పోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు తగ్గించి పేద ప్రజల పొట్ట కొట్టాలని చూస్తుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కూలీలంతా ఐక్యంగా పోరాటం సాగించాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్వతి, వరహాలమ్మ, మౌనిక, వరలక్ష్మి, రమణమ్మ, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.